
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 31.0
కనిష్ఠం 22.0
ANDHRAJYOTHY





యాదగిరీశుడికి
లక్ష పుష్పార్చన
- శాస్త్రోక్తంగా నిత్యపూజలు
- వివిధ విభాగాల ద్వారా రూ.28.75లక్షల ఆదాయం

6



బీజేపీ మూసీ బస

- స్థానిక ఎన్నికలే లక్ష్యంగా క్షేత్రస్థాయికి
- 15న లేదా 16న పరివాహక ప్రాంతాల్లో పర్యటించేందుకు సన్నాహాలు
- ఏర్పాట్లు చేస్తున్న బీజేపీ నేతలు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మూసీ నది పునరుజ్జీవంపై రాజకీయ రగడ కొనసాగుతోంది. మూసీ పునరుజ్జీవంపై అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శల జోరు కొనసాగుతున్న నేపథ్యంలో బీజేపీ మూసీ పరివాహక ప్రాంతాల్లో రాత్రి బస చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాంతంలో పర్యటించి కాంగ్రెస్ ప్రభుత్వ హామీలపై విమర్శలు గుప్పించేందుకు సన్నద్ధమవుతోంది. ఈ నెల 15 లేదా 16వ తేదీన బీజేపీ మూసీ పరివాహక ప్రాంతాల్లో రాత్రి బసకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

మూసీ పునరుజ్జీవం జరిగి తీరుతుందని, రంగారెడ్డి, హైదరాబాద్, ఉమ్మడి నల్లగొండ ప్రజల ప్రయోజనాల కోసం మూసీ ప్రక్షాళనకు పూనుకున్నామని ఇటీవల వలిగొండ మండలం సంగెం బ్రిడ్జి వద్ద నిర్వహించిన మూసీ పునరుజ్జీవ సంకల్ప పాదయాత్రలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టును అడ్డుకుంటే బుల్డోజర్లు ఎక్కించి ప్రక్షాళిస్తామని సీఎం పరోక్షంగా ప్రతిపక్షాలను హెచ్చరించారు. మూసీ అడ్డుకుంటే కుక్కచావు తప్పదని కేసీఆర్‌పై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఈ పాదయాత్ర ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని, తన వెంట నడుస్తాన్న హరీష్, కేటీఆర్‌కు సవాల్ విసురుతున్నానని, నిజంగా చిత్తశుద్ధి ఉంటే తేదీ చెప్పండి... తాను రెడీ అని సీఎం చాలెంజ్ చేశారు. సీఎం వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర సంచలనం సృష్టించాయి. మూసీ ప్రక్షాళన చేయని పక్షంలో తన జన్మ దండగని సీఎం పేర్కొనగా, కేవలం కమీషన్ల కోసమే ఈ ప్రాజెక్టును చేపడుతున్నారని ప్రభుత్వంపై బీఆర్ఎస్ విమర్శలు గుప్పిస్తోంది. బీజేపీ సైతం మూసీ పునరుజ్జీవంపై ప్రభుత్వం విమర్శల దాడిచేస్తోంది. మొత్తానికి మూసీ నది ప్రక్షాళన రాజకీయాలకు వేదికగా మారింది. ఈ నేపథ్యంలో మూసీ పరివాహక ప్రాంతాల్లో రాత్రి బస చేయాలని బీజేపీ నిర్ణయించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి ...

- మిగతా 6వ పేజీలో...



రైతులు సాగుచేసిన ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు కాకుండా నేరుగా మిల్లులకే వస్తుండటంతో మిల్లర్లు ధరలో కోత విధిస్తున్నారు. సాగర్ ఆయకట్టు ప్రాంతంలో ఉన్న హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 10 రోజులుగా వరికోతలు ముమ్మరమయ్యాయి. ఏ-గ్రేడ్ రకానికి క్వింటాకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300గా ప్రభుత్వం మద్దతు ధరగా నిర్ణయించగా, గత వారం నుంచి పట్టణంలోని మిల్లర్లు రూ.2,200లు మాత్రమే చెల్లిస్తున్నారు. గత ఏడాది క్వింటాకు రూ.2,600 వరకు మిల్లర్లు కొనుగోలు చేశారు.

- (ఆంధ్రజ్యోతి,హుజూర్‌నగర్)

ధరలో కోత

- హుజూర్‌నగర్‌లో మిల్లర్ల సిండికేట్
- గత ఏడాదితో పోలిస్తే తగ్గిన ధరలు
- పంట పొలాల నుంచే నేరుగు మిల్లులకు వస్తున్న ధాన్యం
- కొనుగోలు కేంద్రాల వైపు చూడని రైతులు

రైతులు సాగర్ ఆయకట్టులో వానాకాలంలో పెద్ద మొత్తంలో వరి సాగుచేశారు. హుజూర్‌నగర్, కోదాడ, మిర్యాలగూడ, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో వరి అధికంగా సాగైంది. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లోని సుమారు 14 మండలాల్లోని సాగర్ ఆయకట్టులో వరి కోతలు ప్రారంభమై పది రోజులైంది. జిల్లాలో 100 రైస్‌మిల్లులు ఉన్నాయి. హుజూర్‌నగర్ ప్రాంతంలో సుమారు 24 రైస్‌మిల్లులు ఉన్నాయి. వీటిల్లో 16 రైస్‌మిల్లుల్లో మాత్రమే ధాన్యం కొనుగోలుచేస్తున్నారు. యాసంగి సీజన్‌లో ఒక్క హుజూర్‌నగర్‌లో 15 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ప్రస్తుత సీజన్‌లో పది రోజుల్లో లక్ష క్వింటాళ్ల ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేశారు. అధికారులు హుజూర్‌నగర్ ప్రాంతంలో వేపలసింగారం, బూరుగడ్డ, అమరవరం, శ్రీనివాసపురం, హుజూర్‌నగర్ సహకార సంఘాల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశారు. వీటిలో ఏ ఒక్క రైతు కూడా ధాన్యం విక్రయించలేదు. రైతులు సాగుచేసిన చింట్లు, జైశ్రీరామ్, హెచ్ఎంటి లాంటి సన్న రకాలను యంత్రాల ద్వారా నూర్పిడి చేసి సరాసరి మిల్లులకే తరలిస్తున్నారు. 25శాతం తేమ ఉన్నా మిల్లర్లు కొనుగోలు చేస్తున్నా, ధర రూ.2,200 మాత్రమే చెల్లిస్తున్నారు. మిల్లర్లు సిండికేట్‌గా మారి ధర తగ్గించినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. హుజూర్‌నగర్‌లో రోజుకో ధర చెల్లిస్తున్నారు. రెండు రోజులుగా వాతావరణంలో మార్పు

- మిగతా 8వ పేజీలో...



నేటి నుంచి మార్కెట్‌లో టోకెన్ విధానం

భానుపురి, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): పేట మార్కెట్‌కు వానాకాలం ధాన్యం భారీగా వస్తోంది. మార్కెట్‌కు 40వేల బస్తాల ధాన్యం రాక దాటితే టోకెన్ విధానం అమలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఎక్కువ ధాన్యం వస్తే ఎగుమతులు, దిగుమతులకు ఇబ్బందులతోపాటు మార్కెట్‌లో స్థలం ఉండదు. దీంతో మార్కెట్‌కు సెలవు సైతం ప్రకటిస్తారు. వచ్చిన ధాన్యం ఎగుమతి అయ్యాకే మార్కెట్‌కు ధాన్యాన్ని అనుమతిస్తారు. ప్రస్తుత సీజన్‌లో మార్కెట్‌కు భారీగా ధాన్యం వస్తుండటంతో బుధవారం నుంచి టోకెన్ విధానం అమలుకు మార్కెట్ అధికారులు అమలుచేయనున్నారు. మార్కెట్‌లో 125 మంది కమిషన్‌దారులు ఉండగా, వారి వ్యాపారాన్ని బట్టి మూడు కేటగిరీలుగా విభజించి టోకెన్లను ఇవ్వనున్నారు. టోకెన్ ఉన్న సరుకును మాత్రమే రాత్రి 12గంటల నుంచి ఉదయం 8గంటల లోపు వచ్చే ట్రాక్టర్ల లోడు ధాన్యాన్ని మార్కెట్ ప్రాంగణంలోకి అనుమతించాలని నిర్ణయించారు. 8గంటల సమయం దాటితే మరునటి రోజు వరకు మార్కెట్ బయటే ఎదురు చూడాలి. ఇదిలా ఉండగా, మార్కెట్‌కు భారీగా ధాన్యం వస్తుండటంతో కమీషన్‌దారులు ధరలో కోతపెడుతున్నారు. తేమ, తాలు, ముప్పిళ్లు, మట్టిపెళ్లలు సాకుతో ధర తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఈ నెల 2నుంచి 12వ వ తేదీ వరకు మార్కెట్‌కు వచ్చిన ధాన్యంలో పాత ధాన్యానికి మాత్రమే రూ.3వేలు ధర...

- మిగతా 8వ పేజీలో...

న్యూస్ బాక్స్

అంకితభావంతో సేవలందించాలి

ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ గఫార్ అహ్మద్




సమావేశంలో మాట్లాడుతున్న గఫార్ అహ్మద్

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మీ-సేవా కేంద్రాల నిర్వాహకులు అంకితభావంతో ప్రజలకు సేవలందించాలని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ గఫార్ అహ్మద్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని మీ-సేవా కేంద్రాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మీసేవా కేంద్రాల నిర్వాహకులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండాలన్నారు. సమావేశంలో కేంద్రాల నిర్వాహకులు శ్రీకాంత్, కర్ణాకర్, గోనె సాగర్, సురేష్, అంజయ్య, పద్మావతి, ఉమాదేవి, వీరబాబు, అనిత,రాజు,నరేష్,మధు,జగదీష్ పాల్గొన్నారు.

త్వరలో సిబ్బందిని ఏర్పాటు చేస్తాం

డీఎంహెచ్‌వో కోటాచలం



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కోటచలం

మద్దిరాల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సరిపడా సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నారని, త్వరలోనే సిబ్బందిని ఏర్పాటు చేస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ కోటాచలం అన్నారు. మంగళవారం మద్దిరాల మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు ప్రజలకు ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు అందుబాటులో ఉండాలన్నారు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ అమూల్య, హెల్త్ అసిస్టెంట్ బూర, ఆశ వర్కర్ రాధ పాల్గొన్నారు.

టైలరింగ్‌తో స్వయం ఉపాధి

గరిడేపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టైలరింగ్‌తో మహిళలకు స్వయం ఉపాధి లభిస్తుందని స్వామి రామానంద తీర్థ డైరెక్టర్ సాయి లక్ష్మీ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణ కాలం మూడు నెలలు ఉంటుందని, ఎలాంటి రుసుం లేకుండా ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మండలానికి ఒక కేంద్రాన్ని ఏర్పాటుచేసి ఒక ట్రైనర్‌ను నియమించి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్ ఎస్.విహారికృష్ణ, కిషోర్, రాగిరెడ్డి మంగా, వివిధ గ్రామాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



మద్దిరాల మండల కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

సూర్యాపేటరూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. మంగళవారం సూర్యాపేట మండలంలోని పిల్లలమర్రి, బాలెంల, రామన్నగూడెం, రాజానాయక్‌తండా గ్రామాల్లో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. రైతులు తరలించిన ధాన్యం నిల్వలను, వాటి నాణ్యతను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రైతులు ధాన్యం తెచ్చేలా విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలు అనంతరం మిల్లులకు రవాణా ఎగుమతి వేగంగా జరగాలన్నారు. రైతుల ఖాతాల్లో 48గంటల్లో డబ్బులు జమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈవో శ్యాంసుందర్‌రెడ్డి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మద్దిరాల: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కల్గించవద్దని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం మద్దిరాల మండల కేంద్రంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో చేసిన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతులు ప్రభుత్వం అందజేస్తున్న మద్దతు ధర పొందాలని సూచించారు. అనంతరం మద్దిరాల మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ అప్పారావు, ఆర్డీవో మాధవరావు, తహసీల్దార్ అమీన్‌సింగ్, మండల ప్రత్యేకాధికారి నాగయ్య, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, ఏపీఎం మైసయ్య, ఏఎస్‌వో మల్హార్,ఏఈవో అనూష, సీసీ నాగార్జున్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

తుంగతుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. మంగళవారం మండలంలోని వెలుగుపల్లి గ్రామంలో పర్యటించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను, సమగ్ర ఇంటి కుటుంబ సర్వేను పరిశీలించి అనంతరం ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఆయనవెంట ఎంఈవో బోయిని లింగయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అధికారులు నిరంతరం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దయానందం, ఎంపీడీవో శేషుకుమార్, ఏపీఎం కొమ్ము రాంబాబు, సీసీ గడ్డం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలి

నూతన్‌కల్: జిల్లాలో గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలో గన్నీ బ్యాగులను నిల్వ చేసిన గోదాంను పరిశీలించారు. నూతన్‌కల్, తుంగతుర్తి, అర్వపల్లి, మద్దిరాల, ఆత్మకూర్(ఎస్) మండలాలకు సంబంధించిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావాల్సిన 1.25లక్షల గన్నీ బ్యాగులు నూతన్‌కల్ గోదాంలో నిల్వ ఉన్నాయన్నారు. ఆయన వెంట ఆర్డీవో వేణుమాదవరావు, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో సునీత, అధికారులు ఉన్నారు.

రైతులు ప్రభుత్వ మద్దతు ధర పొందాలి

అర్వపల్లి: రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్ అన్నారు. మంగళవారం జాజిరెడ్డిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. తాలు, చెత్తా చెదారం లేకుండా రైతులు ధాన్యాన్ని శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఈవో శోభ, రైతులు పాల్గొన్నారు.

మునగాల రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ రాంబాబు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బరాకత్‌గూడెంలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఆయనవెంట ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ అంజనేయులు, ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్, ఏవో రాజు, ఆర్ఐ రామారావు, పీఎస్ఎస్ సీఈవో బసవయ్య పాల్గొన్నారు.



కార్తికమాసం సందర్భంగా పిల్లలమర్రి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకారంలో స్వామివారు

వైభవంగా కోటి దీపోత్సవం



హుజూర్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపార్వతి సహిత భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం కోటి దీపోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, పార్వతీపరమేశ్వరులకు పూజలు చేశారు. మహిళా భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి కోటి దీపోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో గుజ్జుల కొండారెడ్డి, అర్చకులు రెంటాల రవిశర్మ, దేవులపల్లి సుబ్రమణ్యశర్మ, కీతా మల్లికార్జున్, జూలకంటి ఉపేందర్‌రెడ్డి, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్, బెల్లంకొండ అమర్‌గౌడ్, కోట సూర్యప్రకాశ్, రమేష్ పాల్గొన్నారు.



కోటి దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ వంగవీటి రామారావు

సూర్యాపేట టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. మంగళవారం సూర్యాపేట గ్రంథాలయంలో ఈ నెల 14వతేదీ నుంచి 20వతేదీ వరకు జరిగే 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. అనేక ఉద్యమాలకు కేంద్రాలుగా గ్రంథాలయాలు ఉపయోగపడ్డాయన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, అనేక పోటీ పరీక్షలకు గ్రంథాలయాల్లో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 14న జ్యోతి ప్రజ్వలన, 15న పుస్తక ప్రదర్శన, 16న వ్యాసరచన పోటీలు, 17న పాటల పోటీలు, 18న కవి సమ్మేళనం, 19న మహిళా దినోత్సవం, 20వ తేదీన ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.బాలమ్మ, గ్రంథాలయ అసిస్టెంట్ లైబ్రేరియన్ శ్యాంసుందర్‌రెడ్డి, ఆయా గ్రంథాలయాల లైబ్రేరియన్లు రంగరావు, ఆర్.విజయబాస్కర్, సైదానాయక్, వెంకట్, విక్రమ్‌బాబు పాల్గొన్నారు.

తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తే

పీడీ యాక్ట్ : ఆర్డీవో

హుజూర్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిల్లర్లు రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తామని ఆర్డీవో శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు రైస్‌మిల్లులను ఆకస్మికంగా తనిఖీచేశారు. అనంతరం మార్కెట్‌యార్డ్‌లో రైతులు ఎండబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరకన్నా తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసినట్లు నేరం రుజువైతే క్రిమినల్ కేసులు నమోదుచేసి మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మాయిశ్చర్ ప్రకారం రైతులకు ప్రభుత్వం ఇచ్చిన ధర, బోనస్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జునరెడ్డి, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, అన్నపూర్ణ, సీఈవో నరేందర్‌రెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

యాదగిరీశుడికి లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చన పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం లక్ష పుష్పార్చన పూజలు వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను వివిధ పుష్పాలు, పట్టువస్త్రాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్రనామ పఠనాలు, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన పూజలు చేశారు. పాంచరాత్రాగమ రీతిలో గంట పాటు పూజాపర్వాలు కొనసాగాయి.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

స్వామివారి దివ్యక్షేత్రంలో మంగళవారం నిత్యపూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామి అమ్మవార్లను మేల్కొల్పిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చనలు చేశారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలి పూజలతో నిత్య తిరుకల్యాణపర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.28,75,384 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామివారి దివ్యవిమాన రాజగోపురానికి హైదరాబాద్‌కు చెందిన రాగల శివకాంత్‌కుమార్, శ్రీనివాస్ రూ.5లక్షల చెక్కును అందజేశారు.

మార్మోగుతున్న శరణుఘోష

● పల్లెలు, పట్టణాల్లో మొదలైన పడిపూజలు
● మకర జ్యోతి వరకు కొనసాగనున్న అయ్యప్పపూజలు

హుజూర్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప మాల అంటే ఒక పవిత్రమైన కార్యం. కార్తీక మాసం ప్రారంభం కావడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా అయ్యప్పస్వామి మాలధారణలు మొదలయ్యాయి. అక్టోబరు నుంచి జనవరి 17న మకరవిళక్కు వరకు మాలధారణలో ఉన్న భక్తులు నిత్యం అయ్యప్ప స్వామి పూజల్లో నిమగ్నమవుతుంటారు. ఆయా పూజలతో ఆధ్యాత్మిక చింతన వెల్లివిరుస్తుంది. ముఖ్యంగా హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, మిర్యాలగూడ, భువనగిరి, యాదగిరిగుట్ట, నల్లగొండ పట్టణ ప్రాంతాల్లోని అయ్యప్పస్వామి దేవాలయాల్లో నిత్యం శరణఘోషలు మార్మోగుతుంటాయి. ప్రత్యేకంగా పూజామండపాలు ఏర్పాటుచేసుకుని అయ్యప్ప నామస్మరణ చేస్తుంటారు. మండల దీక్షలు చేసిన అనంతరం మాలధారులు కేరళ రాష్ట్రంలోని శబరిమలలోని అయ్యప్పస్వామి దేవాలయానికి వెళ్లి ఇరుముడి సమర్పిస్తారు. దురలవాట్లకు దూరంగా ఆధ్యాత్మికతకు దగ్గరగా నిత్యం ఆ స్వామిని స్మరిస్తూ పార్వతీపరమేశ్వర్లు, సుబ్రహ్మణ, గణపతి, లక్ష్మీదేవి, సరస్వతి మాతలను పూజిస్తుంటారు. ఉదయం పానీయం, మధ్యాహ్నం భిక్ష, సాయంత్రం అల్పాహారం చేస్తుంటారు. 41 రోజుల మాల ధరించిన సమయంలో పడిపూజలకు హాజరవుతుంటారు. శబరిమలలోని అయ్యప్పస్వామి దేవాలయం మాదిరి 18 మెట్లు ఏర్పాటు చేసి స్వామికి ప్రత్యేక అర్చనలు, పూజలు చేస్తారు. దీనినే పడిపూజ అంటారు. ఎక్కడ ఉన్న స్వాములైనా పడిపూజకు తప్పక హాజరవుతుంటారు. శబరివాసుడి కీర్తనలతో సుమారు రెండు, మూడు గంటల పాటు జరిగే పూజతో ఆ ప్రాంతం ఆధ్యాత్మికలో మునిగిపోతుంటుంది.



పడిపూజలో 18 మెట్లపూజ





పడిపూజం కోసం ప్రత్యేకంగా అలంకరించే మండపం



భజనల్లో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

ఆశయాలకు వయస్సు అడ్డంకి కాదు

● ఉద్యోగ విరమణ పొందినా సేవలు కొనసాగిస్తున్న పలువురు ఉపాధ్యాయులు
● విశ్రాంతి లేకుండా సేవల్లోనే...

సాధించాలనే తపనకు ఆరు పదుల వయస్సు అడ్డంకి కాదని నిరూపిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు సమాజ సేవలో పాలుపంచుకుంటున్నారు. పదవీ విరమణ ఉద్యోగ బాధ్యతలకే కానీ తమ ఆశయాలకు కాదంటున్నారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. సమాజ సేవలో ఆనందం ఉంటుందని పేర్కొంటున్నారు.

మోత్కూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏదైనా చేయాలన్న తపనతో సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందుతున్నారు యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు నూరోజు భాస్కరాచారి, రిటైర్డ్ సీడీపీవో యాదమ్మ దంపతులు. భాస్కరాచారి 2013లో, యాదమ్మ 2020లో ఉద్యోగ విరమణ పొందారు. భాస్కరాచారి రిటైర్ కాక ముందునుంచే సామాజిక సేవా కార్యక్రమాలు చేసేవారు. రిటైర్ అయ్యాక పూర్తి సమయాన్ని అందుకే వెచ్చిస్తున్నారు. అందుకు సతీమణి అండగా నిలిచింది. 12ఏళ్లుగా బుజిలాపురం, దాచారం పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు 100 శాతం ఫలితాలు సాధించేందుకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందిస్తున్నారు. తన తండ్రి జ్ఞాపకార్థం ప్రతి యేటా గురుపూజోత్సవం నిర్వహించి మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్నారు. ఐదారేళ్లుగా మోత్కూరులో వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి వినాయక చవితి సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీలో భాగస్వామి అవుతున్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తూ ఆయన విద్యార్థులకు చెకుముఖి టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నారు. సామాజిక సేవలకు కలెక్టర్ అనితారామచంద్రన్, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ సీఎం కొణిజేటి రోశయ్య, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి నుంచి పలు అవార్డులు అందుకున్నారు.



భాస్కరాచారి దంపతులను సన్మానిస్తున్న వేణుగోపాలచారి

సామాజిక సేవ చేయాలి

ఉద్యోగస్తులు రిటైర్ కాగానే వయస్సు అయిపోయిందని భావించొద్దు. ఆరోగ్యం సహకరించినంత కాలం సామాజి సేవలో పాల్గొనాలి. సామాజిక సేవా కార్యక్రమాలు చాలా తృప్తినిస్తాయి. ఇంటికి పరిమితం కాకుండా సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుంది.



● నూరోజు భాస్కరాచారి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

● ఉత్సాహంతో సమాజ సేవ



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో అన్నదానం

దేవరకొండ : నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణానికి చెందిన అంకం చంద్రమౌళి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడుగా 2012లో పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం 70 ఏళ్ల వయస్సులో ఇంట్లో కాలక్షేపం చేయకుండా రిటైర్డ్ ఉద్యోగుల సేవ సంఘం కార్యదర్శిగా పనిచేస్తూ వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూనే ఉన్నారు. పద్మశాలీ అఫిషియల్, ప్రొఫెషనల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా లయన్స్‌క్లబ్ మిత్ర అధ్యక్షుడిగా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. దేవరకొండలోని నిరుపేదలను, వృద్ధులను గుర్తించి వారికి నిత్యావసరాలు, ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. కరోనా సమయంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పలువురికి భోజనాలు, బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. స్థానిక మార్కండేయస్వామి దేవాలయం ఉపాధ్యక్షుడిగా పనిచేస్తూ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తూ ముందుకు వెళ్తున్నారు. 2024లో బహుజన సమాజ సాంస్కృతిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో చంద్రమౌళికి జాతీయస్థాయి అవార్డును అందజేశారు.

పేదలకు సేవే లక్ష్యంగా ముందుకు




పేదలకు సేవ చేయాలన్నదే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నా. ప్రధానోపాధ్యాయుడుగా పదవీవిరమణ పొందినా తోటి ఉపాధ్యాయ మిత్రులు, సంఘం సభ్యులతో కలిసి విలాసంగా గడుపుతున్నాం. రిటైర్డ్ ఉద్యోగ సంఘం సమస్యలపై పోరాడుతున్నాం. పేదలకు, నిరుపేదలకు సేవ చేయడంతో పాటు ఆర్థికంగా ఆదుకోవాలన్నదే లక్ష్యంతో ముందుకు వెళుతున్నాం.

అంకం చంద్రమౌళి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి

● పనిచేసిన పాఠశాలకు సేవలు

సంస్థాన్ నారాయణపురం : ప్రతీ ఉద్యోగికి రిటైర్మెంట్ తర్వాత జీవితమంతా కుటుంబ సభ్యులతో సరదాగా గడపాలని కోరుకుంటారు. కానీ కొంతమంది మాత్రం విశ్రాంతి అనేది వయసుకే కానీ మనసుకు కాదని ఇతరత్రా పనుల్లో పాలుపంచుకుంటారు. అలాంటి కోవకు చెందిన వారిలో యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలకేంద్రానికి చెందిన ఒకరు బాలగోని యాదయ్య. యాదయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుడి, ప్రధానోపాధ్యాయుడిగా 28 ఏళ్లుగా వివిధ ప్రభుత్వ పాఠశాలలో పనిచేశారు. ఈ ఏడాది మేలో ఉద్యోగ విరమణ చేశారు. రిటైర్డ్ అయినప్పటికీ ఖాళీగా ఇంట్లో ఉండడం ఇష్టం లేక సమాజానికి తమవంతు ఏదైనా చేయాలనుకున్నాడు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడి కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తెలుసుకున్నాడు. గతంలో తాను అదే పాఠశాలలో పనిచేయడం, ఆ ప్రేమతో రోజూ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నాడు. ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు స్వచ్ఛందంగా పాఠాలు బోధిస్తున్నారు. రిటైర్డ్ అయ్యాక విశ్రాంతి తీసుకోకుండా పనిచేస్తూ విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు యాదయ్యను పలువురు అభినందిస్తున్నారు.

విద్యపై ఉన్న మమకారంతో



ఖాళీగా ఉండడం ఇష్టం లేక విద్యార్థులకు స్వచ్ఛందంగా పాఠాలు బోధిస్తున్నా. నేను కూడా అదే పాఠశాలలో చదువుకున్నా. ఉద్యోగం వచ్చాక అక్కడే విద్యాబోధన చేశా. అందువల్లే ఆ పాఠశాలపై మమకారం ఎక్కువ. రిటైర్మెంట్ తర్వాత ఖాళీగా ఉంటే బదులు సమాజానికి ఉపయోగపడేలా ఏదో ఒకటి చేయాలి. తనకు పాఠశాలలో విద్యార్థులకు చదువు చెప్పే అవకాశం రావడం సంతోషంగా ఉంది.

● బాలగోని యాదయ్య, రిటైర్డ్ టీచర్

బీజేపీ మూసీ బస

(5పేజీ తరువాయి)

జి.కిషన్‌రెడ్డితోపాటు సీనియర్ నేతలు, జిల్లా నేతలతో కలిసి మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి, బస చేసేందుకు పార్టీ సన్నాహాలు చేస్తోంది.

సీఎం సవాల్ నేపథ్యంలో

ప్రధానమంత్రి నరేంద్రమోదీ గుజరాత్‌లో గంగా, సబర్మతి నదులను రూ.40వేల కోట్లతో సుందరీకరణ చేస్తుంటే బీజేపీ నేతలు మెచ్చుకున్నారని, తాను తెలంగాణ సీఎం మూసీ పునరుజ్జీవం చేయొద్దా అని వలిగొండ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీని అని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో ఉంటే స్థానిక పరిస్థితులు అవగతమవుతాయని సీఎం వ్యాఖ్యానించారు. ఆయన సవాల్‌ను బీజేపీ స్వీకరిస్తూ, మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకుని, రాత్రి వేళ బస చేయాలని నిర్ణయించింది. మూసీ పరివాహక ప్రాంతాలైన భువనగిరి, బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి, వలిగొండ, రామన్నపేట మండలాల పరిధిలో ఎవరెవరు ఏ ప్రాంతాల్లో పర్యటించాలనే తేదీలను త్వరలో ఖరారు చేసే అవకాశం ఉంది. రాత్రి వేళల్లో సభలు సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. ఈ సమావేశాల వేదికగా కేంద్ర ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు తీసుకున్న చర్యలను ప్రజలకు వివరించే ప్రయత్నాన్ని బీజేపీ నేతలు చేయనున్నారు. ఒక నాడు తాగు నీటిని అందించిన మూసీ ప్రస్తుతం మురికి కూపంగా మారడానికి గత ప్రభుత్వాలే కారణమని ప్రజలకు వివరిస్తూ ఈ ప్రాంత కులవృత్తిదారులతో సంభాషించనున్నారు.

స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పాదయాత్రలు

బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల నుంచి వచ్చిన మద్దతతో స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవాలని ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ మేరకు రాష్ట్ర కమిటీ డిసెంబరు 1వ తేదీ నుంచి క్షేత్రస్థాయికి వెళ్లాలని నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పాదయాత్రలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. స్థానికంగా పార్టీని బలోపేతం చేయడంతో పాటు రానున్న ఎన్నికలే లక్ష్యంగా ప్రచారాన్ని చేపట్టనుంది. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను 100రోజుల్లో అమలు చేస్తామని ఇచ్చిన హామీలపై ఈ పాదయాత్ర ద్వారా ఎండగట్టనుంది. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ప్రజలకు తెలియజేసేందుకు యాత్ర చేపట్టనుంది. జిల్లాలో భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలు పూర్తిస్థాయిలో ఉండగా, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాలు పాక్షికంగా ఉన్నాయి. ప్రతీ నియోజకవర్గానికి రాష్ట్ర స్థాయి నేతను ఇన్‌చార్జీగా నియమించి, స్థానిక నేతలతో కలిసి ఈ యాత్రలు చేపట్టనున్నారు. ఈ మేరకు జిల్లాల వారీగా త్వరలో సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గాల వారీగా రూట్ మ్యాప్‌లను ఖరారు చేయనున్నారు. అందుకోసం స్థానిక నేతల నుంచి యాత్రకు సంబంధించిన పూర్తి వివరాలు తీసుకోనున్నారు.

తైక్వాండోలో బంగారు పతకం



బంగారు పతకంతో జునేరాఖుల్సూమ్ (మధ్యలో)

మిర్యాలగూడటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఎస్ఆర్ డీజీ పాఠశాల 6వ తరగతి విద్యార్థిని జునేరా ఖుల్సూమ్ తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించారు. మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన అండర్-14 నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచినట్లు కోచ్ యూనిస్ మాలిక్ తెలిపారు. జునేరాఖుల్సూమ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో సాధిక్‌అలీ, ఫర్హానాబేగం తదితరులు పాల్గొన్నారు.

కామినేని దంత వైద్య కళాశాలకు ప్రత్యేక గుర్తింపు అవార్డు

● ఢిల్లీలో ప్రధానం చేసిన కేంద్ర ఆరోగ్యశాఖాధికారులు



కేంద్ర ఆరోగ్యశాఖ అధికారుల నుంచి అవార్డు అందుకుంటున్న మహేష్

నార్కట్‌పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలకేంద్రంలోని కామినేని దంత వైద్య విద్యా కళాశాలకు కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ నుంచి అరుదైన గుర్తింపు లభించింది. జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో కామినేని కళాశాల యాజమాన్యం గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు, ర్యాలీలు, దంత ఆరోగ్యంపై అవగాహన సదస్సులను నిర్వహించినందుకు 2024 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక గుర్తింపు అవార్డుకు ఎంపిక చేసింది. మంగళవారం న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర అడిషనల్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎల్.స్వస్తి చరణ్, డైరెక్టర్ ఈఎంఆర్, హెల్త్ సర్వీసుల విభాగం డీజీ డాక్టర్ అతుల్ గోయల్ నుంచి కళాశాల ప్రిన్సిపాల్ పీ మహేష్ అవార్డును అందుకున్నారు.

విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ముందుకుసాగాలి





డిండిలో బాలికల విభాగంలో కబడ్డీ పోటీలు, రాజాపేటలో బాలుర విభాగంలో పోటీ

డిండి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల జోనల్ అధికారి విద్యారాణి అన్నారు. డిండి మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఈ నెల 11 నుంచి నిర్వహిస్తున్న 10వ జోనల్ స్థాయి క్రీడాపోటీలను మంగళవారం ఆమె సందర్శించి, మాట్లాడారు. క్రీడాకారులను పరిచయం చేసుకునేని కొద్దిసేపు ఆడి వారిలో ఉత్సాహం నింపారు. పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. విద్యార్థులు ఏర్పాటుచేసిన ఫొటోగ్యాలరీని సందర్శించారు.

క్యారమ్స్ విభాగంలో

అండర్-14 ఇమాంపేట గురుకుల పాఠశాల ప్రథమస్థానం, కట్టంగూరు ద్వితీయ స్థానం

అండర్-17 విభాగంలో జీవీగూడ ప్రథమ స్థానం, డిండి ద్వితీయస్థానం

అండర్-19 విభాగంలో డిండి ప్రథమ స్థానం, ఇమాంపేట ద్వితీయస్థానం

100 మీటర్ల పరుగుపందెంలో

అండర్-14 విభాగంలో వై.దీపిక జీవిగూడ ప్రథమ, మేఘన మఠంపల్లి ద్వితీయస్థానం.

చెస్ పోటీల్లో

అండర్-14 విభాగంలో జీవిగూడ మొదటి స్థానం, నకిరేకల్ ద్వితీయస్థానం,

అండర్-17 విభాగంలో ఇమాంపేట మొదటి స్థానం, మఠంపల్లి ద్వితీయస్థానం,

అండర్-19 విభాగంలో జీవిగూడ మొదటి స్థానం, డిండి ద్వితీయస్థానం

షాట్‌పుట్ విభాగంలో

అండర్-14 విభాగంలో కట్టంగూరు మొదటి స్థానం, డిండి ద్వితీయస్థానం.

రాజాపేటలో 10వ జోనల్ స్థాయి

రాజాపేట: యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల్లో 10వ జోనల్ స్థాయి పోటీలు మంగళవారం రెండవరోజు కొనసాగాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాడ్మింటన్, చెస్ అథ్లెటిక్స్‌లో క్రీడాకారులు ప్రతిభను చాటారు. క్రీడల నిర్వహణను జోనల్ అధికారి విద్యారాణి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుధాకర్, డీసీవో జగదీశ్వర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రాజు, వివిధ పాఠశాల ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ విజేతలు వీరే

10వ జోనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలో విజేతలను మంగళవారం ప్రిన్సిపాల్ సుధాకర్, జోనల్ అధికారి విద్యారాణి, డీసీవో జగదీశ్వర్‌రెడ్డి ప్రకటించారు.

200మీటర్లలో

అండర్-14 విభాగంలో మహేష్ ప్రథమ, (స్టేషన్‌ఘణ్‌పూర్), ఎం చైతన్య ద్వితీయ(చందూరు)

లంగ్‌జంప్‌లో

ఎం మహేష్ ప్రథమ(స్టేషన్‌ఘణ్‌పూర్), కే అరవింద్ ద్వితీయ(స్టేషన్‌ఘణ్‌పూర్)

అండర్-17 విభాగంలో ఆర్ ప్రణయ్ ప్రథమ(స్టేషన్‌ఘణ్‌పూర్), ప్రవీణ్ ద్వితీయ(హుజూర్‌నగర్)

500 మీటర్ల దూరంలో

అండర్-17 విభాగంలో ఎన్ శివ ప్రథమ(తిప్పర్తి), అభినేవ్‌కుమార్ ద్వితీయ(భువనగిరి)

అండర్-19 విభాగంలో గోపిచంద్ ప్రథమ (మిర్యాలగూడ), సీహెచ్ ప్రవీణ్ ద్వితీయ(స్టేషన్ ఘణ్‌పూర్)

డిస్కస్‌త్రో విభాగంలో

అండర్-19 ఎ శంకర్ ప్రథమ(స్టేషన్‌ఘణ్‌పూర్), ప్రవీణ్ ద్వితీయ (జనగామ),

లాంగ్‌జంప్‌లో

కార్తీక్‌రాజు ప్రథమ(మునగాల), అజయ్‌కుమార్ ద్వితీయ (భువనగిరి) విజేతలుగా నిలిచారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక

కనగల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి చెస్‌పోటీలకు నల్లగొండ జిల్లా కనగల్ మోడల్ స్కూల్ ఇంటర్(బైపీసీ) మొదటి సంవత్సరం విద్యార్థిని అనూష ఎంపికైంది. ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా తరఫున అనూష పాల్గొననుందని ప్రిన్సిపాల్ థామస్, పీడీ విజయ్ తెలిపారు. అనూషను ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు..

తిరుమలగిరి(సాగర్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన పిట్టల సంపత్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. మహబూబ్‌నగర్ జిల్లా రాచాలలో నిర్వహించిన 68వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్-19 కబడ్డీ విభాగంలో ప్రతిభ కనబరిచి డిసెంబరులో మహారాష్ట్రలో నిర్వహించే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం సంపత్ చింతపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సంపత్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై తల్లిదండ్రులు, గ్రామస్థులు, క్రీడాకారులు అభినందించారు.

వాలీబాల్ పోటీల్లో ప్రతిభ

మఠంపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం విద్యార్థిని ఎన్ మల్లేశ్వరి ప్రతిభ కనబరిచింది. అండర్-17విభాగంలో వర్దాపురం ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని మల్లేశ్వరి ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు తరుపున పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు వీరస్వామి తెలిపారు. మల్లేశ్వరిని ఉపాధ్యాయులు అభినందించారు.

నెట్‌బాల్ విభాగంలో సాగర్ విద్యార్థులు

నాగార్జునసాగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీ సెయింట్ జోసప్ పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ఆదిలాబాద్ జిల్లా నిర్మల్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయురాలు లలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల జట్టు ప్రథమ స్థానం సాధించగా, బాలుర జట్టు ద్వితీయస్థానం సాధించిందన్నారు. ప్రథమ స్థానం సాధించిన బాలికల్లో టీ.కీర్తన, ఎండీ సుభానూర్, జే సుష్మవిరాజ్, ఎస్‌కే రిజ్వానా, బీ కరుణ, పీ మహేశ్వరీ, ఆర్ సింధు, బీ పూజ, ఎస్‌కే మోహక్, జే దీక్షితలు ఉన్నారు. బాలుర జట్టులో వెంకటసాయి, పృథ్వీరాజ్, సాయి, నిఖిలేస్, మోహన్, స్వరూప్, నజీబ్, పవన్ కుమార్‌లు ఉన్నారు. విద్యార్థులను జిల్లా నెట్‌బాల్ అసోషియేషన్ కార్యదర్శి కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న విద్యార్థులు

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.132	210	240
సూర్యాపేట	రూ.125	190	220
నల్లగొండ	రూ.150	220	250

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	587.10
టీఎంసీలు	305.5050
ఎడమకాల్వకు నీటి విడుదల	3,374
కుడికాల్వకు	10,200
విద్యుత్ కేంద్రం ద్వారా	0
ఎస్ఎల్‌బీసీ ద్వారా	24,00 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	28,852 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	16,374 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	42.27 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	0
అవుట్‌ఫ్లో	2వేల క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.89 అడుగులు
టీఎంసీలు	4.17
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	429.27 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	369.47 క్యూసెక్కులు

రోడ్డుపై ధాన్యం.. ప్రయాణాలకు ఆటంకం

» జాతీయ రహదారి సర్వీస్ రోడ్లపై ధాన్యం ఆరబోత » ప్రమాదాల బారిన పడుతున్న వాహనాదారులు



భువనగిరి బైపాస్ సర్వీస్ రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

భువనగిరి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి సర్వీస్ రోడ్లపై ధాన్యం ఆరబెడుతుండడంతో వాహనాదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై ధాన్యం ఉండడంతో రోడ్డు ఇరుకుగా మారి వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రమాదాలు జరిగి వాహనదారులు క్షతగాత్రులవుతున్నారు. సర్వీసు రోడ్డుపై పదేళ్లుగా ధాన్యం ఆరబోస్తున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని కొండమడుగు వద్ద ప్రారంభమైన సర్వీసు రోడ్డు భువనగిరి మండలం, భువనగిరి అర్బన్, యాదగిరిగుట్ట మండలం వంగపల్లి వరకు సుమారు 20 కిలోమీటర్ల ఉంటుంది. ఈ రోడ్డుపై సుమారు పది సంవత్సరాలుగా ధాన్యం ఆరబెడుతున్నారు. రోడ్డు ఇరుకుగా ఉండడంతో యాదగిరిగుట్ట, భువనగిరి, బీబీనగర్ మండలాల చెందిన 18 మంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల్లో గాయపడ్డారు. హైదరాబాద్-వరంగల్ 163వ జాతీయ రహదారి భువనగిరి శివారులోని రాయిగిరి సర్వీస్ రోడ్డు, నల్లగొండ ఫ్లైఓవర్ బ్రిడ్జి సర్వీస్ రోడ్డు వద్ద రైతులు ధాన్యం ఆరబోసుకుంటున్నారు. తమకు అనుకూలంగా కల్లాలు లేకపోవడంతోనే గత్యంతరం లేక జాతీయ రహదారికి సంబంధించిన సర్వీస్ రోడ్లను వినియోగించుకుని ధాన్యం ఆరబోస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. భువనగిరి మండలానికి చెందిన ద్విచక్ర వాహనాదారుడు వెంకటేశ్ గమనించకుండా ధాన్యం రాశులపై ఉంచి వెళ్లి కిందపడి గాయపడ్డాడు. అదే విధంగా నిత్యం ఈ రహదారుల గుండా మంత్రులు, జిల్లా స్థాయి అధికారులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. కాగా రాత్రి వేళల్లో ఆ ధాన్యం రాశులపై నల్లటి ప్లాస్టిక్ కవర్లు కప్పిఉంచడం, కుప్పలా పక్కన పెద్ద పెద్ద రాళ్లు పెట్టడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు రైతులతో మాట్లాడి వాహనాదారులకు ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

రైతులు ధాన్యాన్ని సర్వీస్ రోడ్లపై ఆరబోస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. పగిడిపల్లి, అనంతారం, భువనగిరి బాగాయత్, రాయిగిరి పరిధిలోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్లపై ధాన్యాన్ని ఆరబోయవద్దని చెప్పాం. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక పోలీసు లు మా దృష్టికి తెచ్చారు. కౌన్సిలింగ్ ఇచ్చి సర్వీస్ రోడ్లపై ధాన్యం ఆరబోయకుండా చర్యలు తీసుకుంటాం.

\- సైదులు ఆర్అండ్‌బీ ఏఈ, భువనగిరి.

రహదారిపై ధాన్యం ఆరబోయడంతో..

సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం తుమ్మలపెన్‌పహడ్ గ్రామానికి చెందిన పిడమర్తి నాగరాజు(25) దీపావళి పండుగ కోసం ఈ నెల 1వ తేదీన చివ్వెంల మండలం చందుపట్ల గ్రామానికి వెళ్లాడు. గురువారం రాత్రి బైక్‌పై తిరిగి వస్తుండగా వట్టిఖమ్మంపహడ్ సమీపంలో రహదారిపై ఆరబోసిన ధాన్యం కుప్పల కారణంగా అదుపుతప్పి పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు.

రహదారిపై ధాన్యం ఆరబెట్టడం నివారించాలి



రైతులకు అవగాహన కల్పించకపోవడంతో ధాన్యాన్ని రోడ్లపై ఆరబోస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతుల వ్యవసాయ బావుల వద్ద క్లస్టర్ల వారీగా సరిపడా కల్లాలను ఏర్పాటు చేయాలి. రహదారిపై ధాన్యం ఆరబోయకుండా చర్యలు తీసుకోవాలి.

\- కంచిమల్లయ్య, స్థానికుడు

వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

దేవరకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని తాటికోలు గ్రామ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా అవుతుందన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న డ్రైవర్ సోమ్లానాయక్‌పై కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి



రోజా (ఫైల్)

చింతపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని ధైర్యపురితండాలో మంగళవారం జరిగింది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ధైర్యపురితండాకు చెందిన వాంకుడోత్ రోజా(25), హరి దంపతులు గ్రామంలో కిరాణ షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అదే తండాకు చెందిన వాంకుడోత్ వెంకట్, శారద దంపతుల కుమారుడు కల్యాణ్ కిరాణ దుకాణానికి వచ్చి రోజాతో మాటలు కలిపి చనువుగా ఉండేవాడు. సెల్‌ఫోన్ ఇప్పించి ఆమెతో మాట్లాడేవాడు. అక్టోబరు 26వ తేదీన రాత్రి కల్యాణ్ రోజాకు ఫోన్ చేసి పెళ్లి చేసుకుంటానని చెప్పి వరంగల్‌కు తీసుకెళ్లాడు. రెండు రోజుల నుంచి రోజా కన్పించకపోవడంతో రోజా కుటుంబసభ్యులు కల్యాణ్ కుటుంబ సభ్యులను నిలదీశారు. తల్లిదండ్రులు కల్యాణ్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు. అక్టోబరు 28వ తేదీన కల్యాణ్ రోజాతో కలిసి తండాకు వచ్చాడు. హరి కుటుంబసభ్యులతో కలిసి రోజాను కాపురానికి తీసుకెళ్లాడు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ చిలికి చిలికి తారస్థాయి చేరింది. మనస్తాపం చెందిన రోజా అక్టోబరు 30వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. హరి తల్లిదండ్రులు వ్యవసాయ పనులు ముగించుకొని వచ్చేసరికి రోజా ఫ్యాన్‌కు వేలాడుతూ కన్పించింది. చికిత్సనిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందింది. రోజా భర్త హరి ఫిర్యాదు మేరకు కల్యాణ్‌తో పాటు తల్లిదండ్రులు వాంకుడోత్ వెంకట్, శారద బంధువులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

11 రోజులు మృత్యువుతో పోరాడి..

భువనగిరి రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని వీరవెల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన సిరికొండ అయిలయ్య(38) ఈ నెల 2న తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగి అపస్మారక స్థితిలో వెళ్లిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్య చికిత్సకోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. 11రోజులుగా మృత్యువుతో పోరాడి మంగళవారం మృతిచెందాడు. అయిలయ్య సోదరి చర్లపల్లి సత్యలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో వారణాసి సంతోష్‌కుమార్ తెలిపారు. అయిలయ్య బోర్‌వెల్ వాహనంపై డ్రైవర్‌గా పని చేసేవాడు. అతనికి భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

దొంగతనం కేసులో ఏడాది జైలు

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దొంగతనం చేసిన వ్యక్తికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ దేవరకొండ జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి పి. రవీందర్ మంగళవారం తీర్పు ఇచ్చారు. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ రాష్ట్రం గుంటూరు జిల్లాలోని నరసరావుపేటకు చెందిన పాత నేరస్థుడు కత్తి రవికుమార్ నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని రంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన గజ్జెల సుధాకర్‌రెడ్డి ఇంట్లో జనవరి నెలలో తులంన్నర బంగారం దొంగతనం చేశాడు. పెద్దవూర మండలం లింగంపల్లిలో బైక్ దొంగతనం చేశాడు. అతనిపై గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితుడిని చాకచక్యంగా పోలీసులు పట్టుకొని దేవరకొండ కోర్టులో హాజరపరిచారు. నిందితుడిని పట్టుకున్న గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు, కోర్టు కానిస్టేబుల్ శేఖర్‌ను కొండమల్లేపల్లి సీఐ ధనంజయ్య అభినందించారు.

రైలుపట్టాలపై మృతదేహం లభ్యం

భువనగిరి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి - పగిడిపల్లి రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జే కృష్ణారావు తెలిపారు. సుమారు 30 ఏళ్ల వయస్సు ఉండి, శరీరంపై ఎర్రని డ్రాయర్ ఉందని తెలిపారు. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడా, లేక నడుస్తున్న రైలు నుంచి జారి పడి మృతి చెందాడా తేలాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలో భద్రపరిచామని, ఆనవాళ్లు తెలిసిన వారు సెల్ నెంబర్లు 9848222169, 8712568454కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

పశువులు తరలిస్తున్న వాహనాలు పట్టివేత

మునగాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కబేళాకు పశువులను తరలిస్తున్న వాహనాలను మంగళవారం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట జిల్లా మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రం శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా, కోదాడ నుంచి హైదరాబాద్‌కు పశువులను రెండు వాహనాల్లో తరలిస్తున్నారు. ఆయా వాహనాల్లో 17 పశువులను ఆంధ్రప్రదేశ్ జగ్గయ్యపేట నుంచి కబేళాకు తీసుకెళ్తున్నట్లు డ్రైవర్ గొడ్ల బాబీ తెలిపాడని, మరో డ్రైవర్ పరారీలో ఉన్నాడని, ఇరువురిపై కేసు నమోదు చేసి, గోవులను హైదరాబాద్ జీయాగూడ గోశాలకు తరలిస్తున్నట్లు ఎస్ఐ తలిపారు.

డీసీఎంలోని గడ్డి దగ్ధం

వలిగొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి డీసీఎంలోని గడ్డి దగ్ధమైంది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని ఎదుళ్లగూడెం గ్రామంలో మంగళవారం జరిగింది. రామన్నపేటకు చెందిన ఎర్ర నర్సింహ ప్రొద్దటూరు గ్రామంలోని గడ్డిని డీసీఎం వాహనంలో లోడ్ చేసుకొని స్వగ్రామానికి వెళ్తుండగా విద్యుత్‌వైర్లు తగిలి డీసీఎంలోని గడ్డి దగ్ధమై మంటలు చేలరేగాయి. డ్రైవర్ ఫైర్‌సిబ్బంది సమాచారం ఇవ్వడంతో మంటలు ఆర్పేశారు. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు.

హోటల్ క్వార్టర్స్‌లో మహిళ హత్య



ఝాన్సీ మృతదేహం

కేతేపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): హోటల్ సిబ్బంది నివాసించే క్వార్టర్స్‌లో మహిళ హత్యకు గురైంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని ఇనుపాముల శివారులో గల 'మా పల్లెరుచులు' హోటల్‌లో మంగళవారం జరిగింది. పోలీసులు, హోటల్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రికొత్తగూడెం జిల్లా అశ్వాపురానికి చెందిన గంగాధర ఝాన్సీ(22), నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని తెప్పలమడుగు గ్రామానికి చెందిన పెద్దమల్లు కోటేశ్వరరావు అలియాస్ బన్నీ 20రోజుల క్రితం హైవే వెంట గల మా పల్లెరుచులు హోటల్‌లో పనికి కుదిరారు. వీరు హోటల్‌లోనే తిని హోటల్‌కు వెనుక వైపు గల సిబ్బంది క్వార్టర్లలో నివసించేవారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి హోటల్‌లో విధులు ముగించుకుని క్వార్టర్‌కు వెళ్లిన ఝాన్సీ, బన్నీ మంగళవారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో నిద్రలేచి టిఫిన్ చేసి వెళ్లారు. మధ్యాహ్నం హోటల్‌లో డ్యూటీకి రావాల్సిన ఇద్దరూ రాకపోవడంతో హోటల్ యాజమాన్యం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో వారి గదికి వెళ్లి చూస్తే ఝాన్సీ విగతజీవిగా మంచంలో పడి ఉంది. బన్నీ గదిలో లేదు. దీంతో హోటల్ నిర్వహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ శివతేజ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఈ సంఘటనకు బాధ్యుడిగా భావిస్తున్న బన్నీ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఝాన్సీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ఎస్ఐ శివతేజ తెలిపారు. బన్నీ సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా నల్లగొండలో పోలీసులకు పట్టుబడినట్లు సమాచారం.

ట్రాక్టర్ ట్రాలీలో ధాన్యం అన్‌లోడ్ చేస్తుండగా..

● ట్రాలీకి విద్యుత్ తీగలు తగిలి రైతు మృతి



ట్రాలీకి తగిలిన విద్యుత్ తీగలు

మునగాల నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న ధాన్యం ఐకేపీ కేంద్రంలో అన్‌లోడ్ చేస్తుండగా ట్రాలీ విద్యుత్ తీగలకు తగిలి రైతు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని తాడ్వా యి గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తాడ్వాయి గ్రామానికి చెందిన చిర్రా సైదులు(58) పండించిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లో లోడ్ చేసుకొని తాడ్వాయి నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో కలకోవ రోడ్డు సమీపంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధ్యాన్యం కొనుగోలు కేంద్రానికి వెళ్లాడు. ట్రాక్టర్‌లో ఉన్న ధాన్యం అన్‌లోడ్ చేసేందుకు ట్రాలీ హైడ్రాలిక్‌ను ఎత్తి కిందికి దిగాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ నూటల్‌గా ఉండి ముందుకు వెళ్లడంతో పైన ఉన్న 11కేవీ విద్యుత్ తీగల్ హైడ్రాలిక్‌తో ఉన్న ఇనుప పైపులకు తాకాయి. వెంటనే ట్రాక్టర్‌ను ఆపేందుకు వెళ్లడంతో సైదులు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సైదులు భార్య సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



సైదులు (ఫైల్)

తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి..



శాలిగౌరారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పొలంలో గేదెలు మేపుతుండగా ప్రమాదవశాత్తు తెగిపోయిన విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని బైరవునిబండలో మంగళవారం జరిగింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. బైరవునిబండ గ్రామానికి చెందిన మణికొండ యాదయ్య(58) కూలి పనిచేస్తూ జీవనం కొనసా గిస్తున్నాడు. గ్రామానికి చెందిన పులిగిళ్ల గంగయ్య అనే రైతు వ్యక్తిగత పనుల మీద వేరే గ్రామానికి వెళ్తూ తన గేదెలను మేపుకొని వస్తే కూలీ ఇస్తానని మణికొండ యాదయ్యకు గంగయ్య చెప్పాడు. గంగయ్య గేదెలను తోలుకొని యాదయ్య గ్రామ శివారులోని పొలం మేపుతుండగా అప్పటికే తెగిపడిన విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు యాదయ్యకు తాకడం అక్కడికక్కడే మృతిచెందాడు. యాదయ్య కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడి సస్పెన్షన్

మోతె, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని మామిళ్లగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులతో అసభ్యంగా ప్రవర్తిసస్తున్న ఉపాధ్యాయుడిని డీఈవో అశోక్ సస్పెండ్ చేశారు. డీఈవో అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉమెన్ డెవలప్‌మెంట్ చైల్డ్ వెల్ఫేర్, మహిళా శిశుసంక్షేమ ఆధ్వర్యంలో మహిళల రక్షణపై మామిళ్లగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 8వ తేదీన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గణిత ఉపాధ్యాయుడు సీహెచ్.శ్రీనివాసరెడ్డి తమతో కొన్ని నెలలుగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని తొమ్మిది, పదో తరగతి చదువుతున్న ఐదుగురు విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు ఈ కార్యక్రమానికి హాజరైన అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుడిపై హెచ్ఎం రామనర్సయ్యకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని అధికారులకు తెలిపారు. ఈ అంశాన్ని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ దృష్టికి తీసుకువెళ్లారు. విచారణ నిర్వహించాలని డీఈవో అశోక్‌ను కలెక్టర్ ఆదేశించారు. సదరు ఉపాధ్యాయుడు సీహెచ్.శ్రీనివాస్‌రెడ్డి అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని డీఈవో విచారణలో తేలడంతో, ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డిని డీఈవో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

లైసెన్స్ లేకుండా విక్రయిస్తున్న ఔషధాలు సీజ్



అధికారులు సీజ్ చేసిన ఔషధాలు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని దేశ్‌ముఖి గ్రామంలోని మెడికల్ దుకాణంలో లైసెన్స్ లేకుండా విక్రయిస్తున్న 31 రకాల నిషేధిత ఔషధాలను జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్విన్‌కుమార్ మంగళవారం సీజ్ చేశారు. దేశ్‌ముఖిలోని ఆకుల గోపీనాథ్‌కు చెందిన లైసెన్స్ లేని ప్రాంగణంలో నిల్వ చేసిన 31 రకాల ఔషధాలను సీజ్ చేసి, సదరు వ్యక్తిపై డ్రగ్స్ అండ్ కాస్మటిక్స్ యాక్ట్ 1940 ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన మందులను చౌటుప్పల్ జెఎఫ్‌సీఎం కోర్టుకు అప్పగించినట్లు తెలిపారు. సుమారు రూ. 40వేల విలువైన మందులను సీజ్ చేసినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

వలిగొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని లారీలో తరలించడానికి సిద్ధం చేస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని రెడ్లరేపాక గ్రామానిక చెందిన పంతాంగి రాజు, వృత్తిరీత్యా వ్యాపారస్తుడు ఆ గ్రామపరిధిలో శ్రీ వీరాంజనేయ బిన్ని రైస్ మిల్లును నిర్వహిస్తున్నాడు. తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించగా, ప్లాస్టిక్ బస్తాల్లో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. సుమారుగా 240 బస్తాలను లారీలో లోడ్ చేస్తుండగా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆలేరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులో సోమవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ రజినికర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నడికుడి మండలం పులిగిల్ల గ్రామానికి చెందిన టిట రామకృష్ణ(26) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో నివాసముంటూ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం హైదరాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా ఆలేరు బైపాస్ మార్గంలో ఉన్న మెడిస్ హోటల్ వద్దకు రాగానే డివైడర్‌ను ఢీ కొనడంతో వాహనం పల్టీ కొట్టింది. ప్రమాదంతో రామకృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. రామకృష్ణ అవివాహితుడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృత్యువాత

మేళ్లచెరువు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో 20 మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలంలోని పులిచింతల ప్రాజెక్టు కాలనీలో మంగళవారం జరిగింది. బాధితుడు ఆనంగి వెంకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గొర్రెలను మేత కోసం సోమవారం ఉదయం తీసుకెళ్లాడు. సాయంత్రం ప్రాజెక్టు సమీపంలోని నెమలిపురి కాలనీలో ఉన్న కొట్టంలో గొర్రెలను వదిలాడు.

కుక్కలు రాత్రి గొర్రెలపై దాడి చేశాయని, మంగళవారం ఉదయం వెళ్లి చూడగా 20 గొర్రెలు మృతిచెందినట్లు బాధితుడు తెలిపాడు. గొర్రెల విలువ సుమారు రూ.1.50లక్షలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని వెంకయ్య వేడుకున్నాడు.

పబ్లిక్ డిమాండ్
PUBLIC DEMAND

చర్యలు తీసుకోవాలి

మద్దిరాల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు భూతం సాగర్‌యాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పోలుమళ్ల స్టేజీ వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై, భవన నిర్మాణాలకు అనుమతిచ్చిన అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు వంగూరి రమేష్, విక్రమచారి, శేఖర్, రమేష్, స్వామి, యాకయ్య పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

మఠంపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యాపాండు నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం మఠంపల్లిలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్, శాగంరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, సయ్యద్ రన్‌మియా, తిరపతయ్య, వెంకటరెడ్డి హర్యానాయక్, రాము, శంభయ్య, ముత్యాలు, పి.రవి తదితరులు పాల్గొన్నారు.

పింఛను పెంచాలి

మోతె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా దివ్యాంగులకు పింఛనును ప్రభుత్వం పెంచాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధికార ప్రతినిధి పేరెల్లి బాబు అన్నారు. దివ్యాంగులకు పింఛను పెంచాలని మంగళవారం మండలంలోని కర్కాయలగూడెంలో నిర్వహించిన చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ నెల 18 నుంచి 23 వరకు రిలేనిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో ఈ నెల 26న మహా చైతన్య సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నూకపంగు గురువయ్య, డి.కార్తీక్, యాతాకుల యల్లయ్య, ఉపేందర్, రాంబాయమ్మ, కటికం దుర్గయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నృసింహుని కల్యాణం

గరిడేపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాలయంలో లక్ష్మీ నరసింహస్వామి పీఠం వద్ద సోమవారం రాత్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసింహస్వామి పీఠం చైర్మన్ మందాడి వెంకయ్య, గురుస్వాములు ముత్యాలు, వీరయ్యస్వామి, పూజారి రెంటాల సతీష్‌శర్మ పాల్గొన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో..

మఠంపల్లి నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో మంగళవారం శ్రీలక్ష్మీ నృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

కోదాడ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కోదాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కోదాడ మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకట రత్నంబాబు అన్నారు. కార్తీకమాస ఏకాదశి సందర్భంగా మంగళవారం కోదాడలోని అయ్యప్పస్వామి దేవాలయంలోని శివాలయంలో ఎర్నేనిబాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్నేని కుసుమ, రావెళ్ల కృష్ణారావు, మాలతి పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి'

హుజూర్‌నగర్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులను మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలని మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, మాజీ సర్పంచ్ అన్నెం శిరీష కొండారెడ్డి అన్నారు. మంగళవారం వేపలసింగారంలో ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ సమావేశంలో వారు మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా రైతులకు ఉపయోగపడటం లేదన్నారు. సమావేశంలో అన్నెం కొండారెడ్డి, సారెడ్డి భాస్కర్‌రెడ్డి, కర్నాటి శ్రీనివాస్, బ్రహ్మారెడ్డి, హరిలీల పాల్గొన్నారు.

కార్మికులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

హుజూర్‌నగర్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కార్మికులను ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, బీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పచ్చిపాల ఉపేందర్‌యాదవ్, ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకుడు చింతకాయల రాము అన్నారు. మంగళవారం పట్టణంలో వివిధ కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. రైస్ మిల్లు డ్రైవర్లకు వేతనాలు పెంచాలన్నారు. సమావేశంలో వెంకన్న, పర్వతాలు, జానయ్య, సైదులు పాల్గొన్నారు.

కవచం బహూకరణ

నాగారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈటూరు గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి విగ్రహానికి రూ50వేలు విలువైన ఇత్తడి కవచాన్ని అంబటి వీరస్వామి-రాజమ్మ దంపతులు మంగళవారం బహూకరించారు. ఆంజనేయస్వామి కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో అర్చకుడు లక్ష్మణచారి నిర్వహించిన పూజల్లో వీరాస్వామి-రాజమ్మ దంపతులు పాల్గొన్నారు.

ఈ రోడ్డులో వెళ్లేదెలా?

రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు ● అడుగడుగునా గుంతలతో అవస్థలు



గాతులు తీయడంతో అధ్వానంగా ఉన్న ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల - ఇందిరమ్మ కాలనీ రోడ్డు

భానుపురి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట పట్టణంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఇందిరమ్మ మొదటి విడత కాలనీ వరకు వెళ్లడానికి ఉన్న మట్టి రోడ్డు వర్షాలకు అధ్వానంగా మారింది. సూర్యాపేట పట్టణంలోని ఈ మట్టి రోడ్డును పదేళ్ల ఏర్పాటు చేశారు. ఈ రోడ్డును బీటీగా మార్చనందున అడుగడుగనా గుంతలు పడినందున వాహనదారులు రాకపోకలు సాగించలేకపోతున్నారు. గుంతలుపడి అధ్వానంగా ఉంది. ప్రయాణికులు, వాహనదారులు వెళ్లలేకపోతున్నారు. ఈ రోడ్డు ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల వైపు రావడానికి సీతారాంపురం, ఎన్టీఆర్ కాలనీవాసులు, అన్నాదురైనగర్, ఇందిరమ్మ 1, 2, 3కాలనీల వాసులకు, చంద్రన్నకుంట వాసులకు ఉపయోగపడుతోంది. ఈ రోడ్డు బాగుంటే ఇతర గ్రామాల నుంచి వచ్చే వాహనదారులు పట్టణంలోని ఇరుకు ప్రాంతాల నుంచి వెళ్లకుండా నేరుగా ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల, ఎస్పీ కార్యాలయం, జనగాం క్రాస్‌రోడ్డు వైపు నేరుగా వచ్చే అవకాశం ఉంది. నల్లచెరువుకు వెళ్లే కాల్వ నీరు ఈ రోడ్డు కింది నుంచి వెళ్లడానికి గూనలు వేశారు. నీరు సక్రమంగా వెళ్లడం కోసం నీటిపారుదల, పురపాలక శాఖ అధికారులు రోడ్డును తవ్వారు. వరదలలకు మరికొన్ని చోట్ల రోడ్డు కోతకు గురైంది. గూనలు వరదకు కొట్టుకుపోయి చిందరవందరంగా పడి ఉంటడంతో ఈ రోడ్డులో ప్రజలు వెళ్లలేని దుస్థితి నెలకొంది. .రోడ్డు చిందరవందరంగా, ప్రమాదకరంగా మారినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు రోడ్డు వెంట చెత్తచెదారం, జీవాల కళేబరాలను కూడా వేస్తున్నారని సమీపంలో గృహాల యజమానులు, పొలాల యజమానులు తెలిపారు.

గుంతలమయంగా రోడ్డు మారింది



సీతారాంపురం నుంచి వచ్చే రోడ్డు ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల వైపు వెళుతంది. వర్షాలకు రోడ్డు అంతా గుంతలమయంగా మారింది. వర్షపునీరు వెళ్లడానికి గాతులు తీశారు. ఈ రోడ్డులో పశువులు, గొర్రెలను తోలుకుని వెళ్తుంటే గాతులు దాటలేకపోతున్నాయి.

● నగిరే లింగయ్య, రైతు, సీతారాంపురం

నిధులు మంజూరు కాలేదు

ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఇందిరమ్మకాలనీల వైపు వెళ్లే రోడ్డుకు నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించాం. ఇంకా నిధులు మంజూరు కాలేదు. రోడ్డు మాత్రం మునిసిపాలిటీ పరిధిలోనే ఉంది.

● పద్మ, డీఈ, ఆర్అండ్‌బీ, సూర్యాపేట

సర్వేను సమగ్రంగా నిర్వహించాలి



పెన్‌పహాడ్ మండలం మహమ్మదాపురంలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న సివిల్ సప్లై డీఎం ప్రసాద్

పెన్‌పహాడ్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వేను సమగ్రవంతంగా నిర్వహించాలని సివిల్ సప్లై డీఎం ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని మహమ్మదాపురం గ్రామంలో ఇంటింటి సర్వేను, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. ప్రజలు ఎన్యూమరేటర్లకు సహకరించాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లాలునాయక్, ఏపీఎం అజయ్‌నాయక్, కార్యదర్శి లావణ్య, సంఘ బంధం అధ్యక్షురాలు నీరజ, వీవోఏ విజయ, ఎన్యూమరేటర్లు శ్రీను, మమత, సరిత, సైదమ్మ పాల్గొన్నారు.

నూతన్‌కల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అధికారులు నిర్వహిస్తున్న సర్వేకు ప్రజలు సహకరించాలని సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవ్‌రావు కోరారు. మండల కేంద్రంలో సర్వేను పరిశీలించి మాట్లాడారు. ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత, అధికారులు ఉన్నారు.

సూర్యాపేట టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వేలో ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలని సూర్యాపేట మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 20వార్డులో ఇంటింటి సర్వేను పరిశీలించి మాట్లాడారు. ఎవరూ ఎటువంటి జిరాక్స్‌లు ఇవ్వాల్సిన పనిలేదన్నారు. సర్వేలో భాగంగా ఇంటి ముందు స్టిక్కర్ వేయకుంటే సంబంధిత వార్డు అధికారికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డీఈ సత్యారావు, డీలింగ్ అసిస్టెంట్ గోపారపు రాజు, ఎండీ గౌసుద్దీన్, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, మనోజ్ పాల్గొన్నారు.

మఠంపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేలో సిబ్బంది పకడ్బందీగా వివరాలు సేకరించాలని ఇన్‌చార్జి ఎంపీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని సుల్తాన్‌పురంతండా తదితర గ్రామాల్లో చేపట్టిన సర్వేను ఆమె పరిశీలించి మాట్లాడారు.

కోదాడ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆర్డీవో సూర్యనారాయణ అన్నారు. మండలంలోని దోరకుంట గ్రామంలో సమగ్ర కుటుంబ, కుల గణన సర్వేను పరిశీలించి మాట్లాడారు. కూచిపూడి, కాపుగల్లు, రెడ్లకుంట గ్రామాల్లో సర్వేను ఎంపీడీవో రాంచందర్‌రావు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో పాండురంగయ్య, కార్యదర్శి జానీపాషా పాల్గొన్నారు.

సర్వే కోసం ఉపాధ్యాయులపై ఒత్తిడి తేవొద్దు

చిలుకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి కులగణన సర్వే కోసం ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకురావొద్దని ఎస్‌జీటీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండా రామాంజనేయులు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో ఒక్కో ఉపాధ్యాయుడికి 150 నుంచి 170 ఇళ్లు కేటాయించారని, ఒక్కో ఇంటికి 45 నిమిషాల సమయం పడుతుందన్నారు. సర్వే కోసం మధ్యాహ్నం మాత్రమే అవకాశం కల్పించి, తక్కువ సమయంలో పూర్తి చేయాలని అధికారులు ఒత్తిడి చేయడం సరికాదన్నారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు చేసుకునే ప్రజలు అందుబాటులో ఉండకపోవడంతో సర్వేలు సకాలంలో పూర్తికావడం లేదన్నారు. సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలంటే ఎన్యూమరేటర్ల సంఖ్య పెంచాలని, అంతేకానీ ఉపాధ్యాయులపై ఒత్తిడి పెట్టడం సరికాదన్నారు.

కష్టపడినవారికి కాంగ్రెస్‌లో గుర్తింపు



నాగరాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యే సామేలు

నూతన్‌కల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కష్టపడిన వారికి కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడిగా మండలంలోని వెంకేపల్లి గ్రామానికి చెందిన పాల్వాయి నాగరాజు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేలును మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నాగరాజును ఎమ్మెల్యే సన్మానించి మాట్లాడారు. నాగరాజు మాట్లాడుతూ తనను ఎంపిక చేసిందుకు సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలుకు కృతజ్ఞతలు తెలిపాడు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామానంద తీర్థ సంస్థ డైరెక్టర్ సాయిలక్ష్మి

హుజూర్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగాలని రామానంద తీర్థ సంస్థ డైరెక్టర్ సాయిలక్ష్మి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ కోరారు. శారదనికేతన్ మహిళ మండలి ఆధ్వర్యంలో కుట్టుమిషన్ శిక్షణ పొందిన పలువురికి మంగళవారం పట్టణంలోని అరుణసఫలి భవన్‌లో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. స్వయం ఉపాధి పొంది కుటుంబాలకు ఆసరాగా నిలవాలన్నారు. కాగా కుట్టుమిషన్ సెంటర్‌లో మగ్గం వర్కుల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అనంతరం మహిళల హక్కుల కోసం తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు పశ్య కన్నమ్మ చేసిన కృషిని ప్రశంసించారు. కార్యక్రమంలో హరికృష్ణ, కిషోర్, ఉస్తెల సృజన, దేవరం మల్లీశ్వరి, బండి ప్రమీల, జూలకంటి అరుణ, యల్లావుల ఉమ, లలిత పాల్గొన్నారు.

ఆలయంలో భక్తులకు సేవలు అందిస్తాం



ఆలయ ప్రాంగణంలో వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న బోయినపల్లి రేఖ

అర్వపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అర్వపల్లి శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో భక్తులకు సేవలు అందిస్తామని రేఖ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు బోయినపల్లి రేఖ అన్నారు. ఆలయ ప్రాంగణంలో రూ.2లక్షలతో బోరు వేయించి, వాటర్ ట్యాంక్, మోటార్లను ఆమె మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. భక్తుల సౌకర్యార్థం వీటిని ఏర్పాటు చేశామన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా మండలంలోని అడివెంల గ్రామంలో 1000మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన సంఘం తుంగతుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, విజయ్, కుంభం సతీష్, కోటిప్రసాద్, మాధవ్, వినయ్, కుంభం వెంకటేశ్వర్లు, శేషు, సాయి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

హుజూర్‌నగర్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇటీవల మృతిచెందిన ఫొటోగ్రాఫర్ రంజిత్ కుటుంబానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్ మంగళవారం రూ.1.60లక్షల విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేపూరి లక్ష్మణ్, మహేష్, రవి, యాదగిరి, శ్రీనివాస్, హరికృష్ణ, శ్రీకాంత్, శేషు, కృష్ణ, రాము పాల్గొన్నారు.

నాగారం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసునూరు గ్రామానికి చెందిన పత్తేపురం పాపయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబానికి పసునూరు గ్రామానికి చెందిన టెక్నోడీడ్ ఐటీ సంస్థ చైర్మన్ వంగూరి దామోదర్ పంపిన రూ 5వేలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పంది శ్రీనివాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పత్తెపురం రాఖీ, నరాల నాగయ్య, సతీష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కలర్ టీవీ బహూకరణ

నేరేడుచర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో డిజిటల్ తరగతుల బోధనకు 2019-20బ్యాచ్ విద్యార్థులు రూ. 10వేల విలువైన కలర్ టీవీని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధుకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సైదులు, నాగరాజు, వెంకన్న, దుర్గా ప్రసాద్, ఉపాధ్యాయులు వీరబాబు, రషీద్‌ఖాన్, జానకిరాములు, వెంకటేశ్వరావు, నర్సింహారావు, భానుమతి, జానయ్య, వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, విజయలక్ష్మి, సరస్వతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మార్కెట్‌లో టోకెన్ విధానం

(5పేజీ తరువాయి)

దాటింది. హమాలీలు, చాటవాలా, ఆడకూలీలు, దడవాయిలు బిచ్చం పేరుతో డబ్బాల కొద్దీ ధాన్యం తీసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు.



సూర్యాపేట మార్కెట్‌లో ఉపయోగంలో లేని వేబ్రిడ్జి

తేదీ	మార్కెట్‌కు వచ్చిన రైతులు	బస్తాల ధాన్యం
2	509	34,535
4	573	38,715
6	485	31,788
7	479	31,646
8	549	36,352
9	569	40,072
11	770	52,449

మార్కెట్‌లో పని చేయని సీసీ కెమెరాలు

వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. గత ప్రభుత్వం సుమారు రూ.10 లక్షల వ్యయంతో వీటిని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం అవి పనిచేయడం లేదు. బడ్జెట్ వచ్చినప్పుడు మరమ్మతులు చేయిస్తామని మార్కెట్ అధికారులు చెబుతున్నారు. ఇక మార్కెట్‌లో రెండు వేబ్రిడ్జిలు ఉండగా, అలంకారప్రాయంగా నిలిచాయి. కాంటాల్లో ధాన్యం తూస్తున్నారని, వేబ్రిడ్జిలతో పని ఉండదని అధికారులు చెబుతున్నారు.

మార్కెట్‌లో కోత విధిస్తున్నారు



ధాన్యం తీసుకువస్తే తేమ, తాలు, ముప్పిళ్లు, మట్టిపెళ్లలు ఎక్కువగా ఉంటున్నాయని ధరలో కోత విధిస్తున్నారు. చేతుల్లో ధాన్యం నలిపి చూసే పద్ధతిని తీసివేయాలి. 100 బస్తాల ధాన్యం తీసుకువస్తే రూ.2300 మాత్రమే ధర పడింది. అధికారుల పర్యవేక్షణ లేదు.

●భూపతి శ్రీనివాస్, రత్నపురం

తేమశాతం 17 కంటే ఎక్కువ ఉండవద్దు

ధాన్యంలో తేమశాతం 17 కంటే ఎక్కువగా ఉండవద్దు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని తీసుకురావాలి. తేమ ఎక్కువగా ఉంటే ధర తగ్గుతుంది. బుధవారం నుంచి మార్కెట్‌లో టోకెన్ విధానం అమలు చేస్తాం. కొన్ని షెడ్లలోనే సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయిస్తాం. పత్తి లారీల కోసం వేబ్రిడ్జిలు ఉపయోగపడతాయి.


● సంతోష్‌కుమార్, సూర్యాపేట మార్కెట్ కార్యదర్శి

ధరలో కోత

(5పేజీ తరువాయి)

రావడంతో రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఇదే అదనుగా భావించిన మిల్లర్లు ధరను రూ.400 నుంచి రూ.500 వరకు తగ్గించారు.

క్వింటాకు రూ.3వేలు చెల్లించాలి



రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలి. క్వింటాకు కనీసం రూ.3వేలు ధర చెల్లించాలి. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలుచేయాలి. రైతు సంక్షేమాన్ని విస్మరించడం తగదు. సన్నాలు మొత్తం మిల్లర్లే కొనుగోలు చేస్తున్నందున రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలి.

●గన్నా చంద్రశేఖర్, సీపీఐ రాష్ట్ర నాయకుడు

తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తే కేసు



తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తే మిల్లర్లపై క్రిమినల్ కేసు పెడతాం. ప్రభుత్వం ప్రకటించిన ధర ప్రకారం ధాన్యం కొనుగోలుచేయాలి. రైతులను మోసం చేసినా, తక్కువ ధరకు కొనుగోలు చేసినా పీడీ యాక్ట్ నమోదు చేస్తాం. డివిజన్ వ్యాప్తంగా రెవెన్యూ అధికారులు మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు.

●శ్రీనివాసులు, ఆర్డీవో

సమాచారం

18న రేషన్ బియ్యం వేలం

మేళ్లచెర్వు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇటీవల స్వాధీనం చేసుకున్న 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఈ నెల 18న బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తామని తహసీల్దార్ జ్యోతి తెలిపారు. మండలంలోని రేషన్ డీలర్ మామిడి వీరబాబు 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచగా స్వాధీనం చేసుకుని, కలెక్టర్ ఆదేశాల మేరకు రెవిన్యూ తహసీల్దార్ కార్యాలయంలో వేలం ద్వారా విక్రయిస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు రూ.4వేల దరావత్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని తహసీల్దార్ ఒక ప్రకటనలో కోరారు.

'బీజేపీని బలోపేతం చేయాలి'

భానుపురి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం సూర్యాపేటలోని బీజేపీ కార్యాలయంలో సూర్యాపేట మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 35 పోలింగ్ బూత్‌లకు నూతన కమిటీలను ఏర్పాటు చేయడానికి ఐదు శక్తికేంద్రాల ఇన్‌చార్జిలను నియమించామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, మండల పార్టీ అధ్యక్షుడు వెన్నశశిధర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చల్లమల్ల నర్సింహ, మండల ఎన్నికల ఇన్‌చార్జి పల్సా మల్సూర్‌గౌడ్, ఉప్పుశ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భానుపురి, నవంబరు 12(ఆంధ్ర జ్యోతి): సూర్యాపేట 1వ పట్టణంలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నం దున బుధవారం ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఆర్.సురేష్ తెలిపారు. జమ్మిగడ్డ, హౌసింగ్ బోర్డు, చర్చి కాంపౌండ్, శ్రీనివాసకాలనీ, రాజారాంకాలేజ్, మెట్రో ఆసుపత్రి ఏరియా, మన్నా చర్చి ప్రాంతం, బ్రాహ్మణ కల్యాణమండపం, శ్రీనగర్‌కాలనీ, ఖమ్మంరోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

నేరేడుచర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నేరేడుచర్ల మండల వ్యవసాయాధికారి జావిద్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని విత్తనాల విక్రయ దుకాణాలను తనిఖీ చేసి మాట్లాడారు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు.

ఐఏఎల్ నూతన కార్యవర్గం

కోదాడ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) కోదాడ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్ రహీం, ఉపాధ్యక్షుడిగా కోడూరు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌వీ చలం, జాయింట్ సెక్రటరీగా ఆవుల మల్లికార్జున్, కోశాధికారిగా చెన్న పెద్దబ్బాయి, మహిళా ప్రతినిధిగా వి.రాంబాయి, సభ్యులుగా నవీన్ కుమార్, సుల్తాన్, నాగరాజు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చింతకుంట్ల రామిరెడ్డి, గట్ల నరసింహారావు, కాకర్ల వెంకటేశ్వరరావు శ్రీధర్, మురళి పాల్గొన్నారు.

అప్రమత్తతే రక్ష

కోదాడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్రం అధికారి సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్ఆర్ఎం పాఠశాలలో అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కేశినేని శ్రీదేవి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి

తిరుమలగిరి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి నర్సింహారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కేంద్రానికి ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్ధతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

సూర్యాపేటఅర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డ సుమంగళి ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 26వతేదీన జరిగే టీఎమ్మార్పీఎస్ విజయోత్సవ సభను విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉపేందర్‌మాదిగ అన్నారు. విజయోత్సవ సభ కరపత్రాలను మంగళవారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సత్యం, వెంకన్న, రమేష్, శంకర్, సైదులు, కాటయ్య, పాల్గొన్నారు.

దాడిపై నిరసన

నేరేడుచర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల గ్రామంలో కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో పాటు ఇతర అధికారులపై దాడి చేయడాన్ని ఖండిస్తూ నేరేడుచర్ల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, డిప్యూటీ తహసీల్దార్ మౌనిక, ఆర్ఐ నర్సయ్య, చంద్రమ్మ, అబ్బాస్ పాల్గొన్నారు.